క్లుప్తంగా

ఉమాచంద్రమౌళీశ్వరుడికి విశేష పూజలు



సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో కొలువైన ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి, విశేష అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



చెక్ అందిస్తున్న దాత అప్పారావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి అన్నప్రసాద పథకానికి నగరంలోని శివాజీపాలేనికి చెందిన దువ్వి అప్పారావు సోమవారం రూ.లక్ష 116 విరాళమిచ్చారు. సంబంధిత విరాళాన్ని చెక్ రూపంలో సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో అందించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేష వస్త్రంను అధికారులు అందజేశారు.

ఉత్తమ టీబీ యూనిట్ వైద్యాధికారిగా కనకప్పారావు



జిల్లా అధికారుల నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ కనకప్పారావు

పరవాడ: అచ్యుతాపురం టీబీయూనిట్ క్షయ నివారణాధికారిగా వ్యవహరిస్తున్న వాడచీపురుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి వి.కనకప్పారావుకు ఉత్తమ టీబీ యూనిట్ వైద్యాధికారి అవార్డు లభించింది. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా సభ్యుడు డాక్టర్ నగేష్ గుప్తా, డాక్టర్ బాలాజీ చేతుల మీదుగా సోమవారం ఆయన ఈ అవార్డును అందుకున్నారు. అవార్డును అందుకున్న కనకప్పారావుకు వాడచీపురుపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అభినందనలు తెలిపారు.

పీజీఆర్ఎస్‌కు 9 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ హేమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్-8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 9 వినతులు అందాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్ హేమావతి వినతులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు జెడ్సీ ఆదేశించారు. కార్యక్రమంలో జోన్-8లోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పినగాడిలో భూ సర్వేపై అవగాహన ర్యాలీ

పెందుర్తి: ప్రభుత్వం చేపట్టనున్న భూ సర్వేపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు మంగళవారం ర్యాలీ చేపట్టనున్నట్లు గ్రామ రెవెన్యూ అధికారి సుబ్బారావు తెలిపారు. ఉదయం 10 గంటలకు పినగాడి సచివాలయం నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. పినగాడి రెవెన్యూ పరిధిలోని పినగాడి, మొగలిపురం, కోట్నివానిపాలెం, రాంపురం రైతులు రావాలని కోరారు.

గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలకం. అయితే సబ్బవరం మండలంలో చాలా అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాలు, ఇరుకు గదుల్లో అరకొర వసతుల మధ్యే కొనసాగుతున్నాయి. అద్దె భవనాలు, ప్రభుత్వ భవనాల్లో సర్దుకుపోతున్న కేంద్రాల్లో వసతులు కూడా పరిమితంగానే ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పలు చోట్ల సొంత భవనాల నిర్మాణ పనులు ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. అవి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారాయి.



తెలుకులవానిపాలెంలో అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రం, (ఇన్‌సెట్) అద్దె భవనంలో నిర్వహిస్తున్న ప్రీ స్కూల్

అంగన్‌వాడీ కేంద్రాల్లో.. అరకొర వసతులు



చింతగట్ల అగ్రహారంలో అర్ధంతరంగా నిలిచిన భవనంలో మొలిచిన తుప్పలు, పిచ్చి మొక్కలు

సబ్బవరం: మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు చాలా వరకూ అరకొర వసతుల మధ్యే నెట్టుకొస్తున్నాయి. కొన్ని ప్రభుత్వ భవనాల పంచన కాలం వెల్లదీస్తుంటే.. మరికొన్ని అద్దె భవనాల్లో నెట్టుకొస్తున్నాయి. అద్దె భవనాలంటే పెద్దపెద్ద నిర్మాణాలు కాదు. చాలా వరకు అవి రేకుల షెడ్లే. వీటిలో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించేందుకు వీలుకాని పరిస్థితి. దీంతో ఆయా ప్రాంతాల్లోని లబ్ధిదారులకు ఆశించిన స్థాయిలో అంగన్‌వాడీల సేవలు అందించే పరిస్థితి లేకుండా పోతోంది. ప్రధానంగా ప్రీ స్కూళ్ల నిర్వహణ భారంగా మారుతోంది.

అరకొర వసతుల మధ్య..

సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు నిధుల కొరత, అధికారుల నిర్లక్ష్యం కారణంగా అరకొర వసతుల మధ్యే నెట్టుకొస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో సొంత భవనాల కోసం చేపట్టిన నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. మరి కొన్ని చోట్ల అంగన్‌వాడీ భవనాలకు అవసరమైన స్థల సమీకరణ చేయలేక, నిర్మాణ ప్రతిపాదనలకూ నోచుకోని పరిస్థితి. దీంతో ఆయా అంగన్‌వాడీ కేంద్రాలను పరాయి పంచన నిర్వహించాల్సి వస్తోంది. వీటిలో కొన్నింటిని అందుబాటులో ఉన్న సామాజిక భవనాల్లో సర్దుబాటు చేయగా, మరి కొన్నింటికి అద్దె భవనాలే దిక్కయ్యాయి. అద్దె భవనాలకు యజమానులు విధించే పరిమితుల మధ్య, చాలీచాలని గదులతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది.



రాయపుర అగ్రహారంలో ఏళ్ల తరబడి నిర్మాణం పూర్తికాని అంగన్‌వాడీ భవనం

మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు	87
మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు	74
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు	13
సొంత భవనాల్లో నడుస్తున్నవి	59
అద్దె భవనాల్లో నడుస్తున్నవి	14
ప్రభుత్వ భవనాల్లో నడుస్తున్నవి	14
అంగన్‌వాడీ కేంద్రాలు లేనివి	17
అసంపూర్తి నిర్మాణంలో ఉన్నవి	7
అంగన్‌వాడీలకు వెళ్తున్న చిన్నారులు	5,408
మొత్తం అంగన్‌వాడీ కార్యకర్తలు	86
మొత్తం అంగన్‌వాడీ హెల్పర్లు	84

అద్దె భవనంతో పరిమితులు



వంగలి శివారు తెలుకులవానిపాలెంలోని మినీ అంగన్‌వాడీ కేంద్రం అద్దె ఇంట్లోనే నిర్వహిస్తున్నాం. సమీపంలో ప్రభుత్వం భవనాలేవీ లేవు. సొంత భవనాలున్న చోట కేంద్రానికి కావాల్సిన అన్ని రకాల వసతుల్ని ప్రభుత్వం కల్పిస్తోంది. అద్దె భవనంలో పరిమితులు తప్పవు. ఇక్కడ స్థల సమస్య ఉంది. అధికారుల ఆదేశాల మేరకు స్థల పరిశీలన జరుగుతోంది. త్వరలో సొంత భవనం నిర్మించి అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు చెప్పన్నారు.

– చిట్టిబోయిన బాల, అంగన్‌వాడీ కార్యకర్త, తెలుకులవానిపాలెం

నిర్మాణం పూర్తి చేస్తామన్నారు



అమృతపురం శివారు చింతగట్ల అగ్రహారంలోని అంగన్‌వాడీ కేంద్ర భవనం ఏళ్ల తరబడి నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. ఈ నిర్మాణం చుట్టూ చెట్లు, తుప్పలు మొలిచి శిథిలావస్థకు చేరుకుంటోంది. దీంతో మరో దారి లేక ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నాం. ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించాం. త్వరలో నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు.

– రామలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త, చింతగట్ల అగ్రహారం

ప్రతిపాదనలు పంపించాం



మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల్లేవు. దీంతో కొన్నింటిని ప్రభుత్వ భవనాల్లో, అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నాం. పలు గ్రామాల్లో అసంపూర్తిగా నిలిచిన భవనాలను పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు రూపొందించి, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుతో పాటు ఉన్నతాధికారులకు అందించాం. మరికొన్ని చోట్ల భవన నిర్మాణాలకు స్థల సమస్య ఉంది. తహసీల్దార్‌కు నివేదించాం.

– లలిత కుమారి, ఐసీడీఎస్ సీడీపీవో, సబ్బవరం ప్రాజెక్టు

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం: స్థానిక కేజీబీవీలో 2025-26 విద్యా సంవత్సరానికి 6 నుంచి 9వ తరగతి వరకూ మిగులు సీట్లు, ఇంటర్ బైపీసీలో ప్రవేశాలకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎ.మృదుల సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బడి బయట పిల్లలు, అనాథలు, డ్రాపౌట్స్, పేద, ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ బాలికలు అర్హులన్నారు. అర్హులైన బాలికలు కేజీబీవీ వెబ్‌సైట్‌లో ఏప్రిల్ 11లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే ప్రవేశాలకు పరిగణిస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతోపాటు, పాఠశాల నోటీస్ బోర్డులో కూడా ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు.

చోడేశ్వరుడికి ప్రత్యేక పూజలు



చోడేశ్వరస్వామి

పెందుర్తి: పినగాడిలో కొలువుదీరిన చోడేశ్వరస్వామి దేవాయలంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం అభిషేకాలు జరిపి, విశేష అలంకరణ చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

పండగల్లో జూదమాడితే కఠిన చర్యలు



సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: గ్రామాల్లో అమ్మవారి పండగలు, ఇతర కార్యక్రమాలు, వారాంతాల్లో పేకాట, కోడిపందాలు, గుండాట వంటి జూదమాడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ హెచ్చరించారు. హైకోర్టు ఆదేశాల మేరకు పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో పూర్తిగా జూదాన్ని నిషేధించామన్నారు. పండగల్లో అశ్లీల నృత్యాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు కూడా పూర్తి నిషిద్ధమన్నారు. అమ్మవార్ల పండగలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే మాత్రం ఎంతటివారినైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో బెట్టింగ్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బెట్టింగ్ వ్యవహారంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

టిడ్కో కాలనీ సమస్యలపై నిరసన



తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి సమస్యలపై వినతిపత్రం అందిస్తున్న కాలనీవాసులు

పరవాడ: స్థానిక టిడ్కో గృహ సముదాయంలో వీధి దీపాల్లేక అవస్థలు పడుతున్నామని, వెంటనే వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం, విద్యుత్ శాఖ కార్యాలయాల వద్ద కాలనీ వాసులు సోమవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఐద్వా ప్రతినిధి పి.మాణిక్యం మాట్లాడుతూ టిడ్కో కాలనీ సమస్యల పరిష్కారానికి అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. వీధి దీపాలు లేక రాత్రి సమయంలో చాలా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గృహ వసతి లేని వారికి ఇళ్ల మంజూరు, పింఛన్లు లేని వారిని గుర్తించి వెంటనే నూతన పింఛన్లు మంజూరు చేయాలన్నారు. కొత్తగా రేషన్ కార్డుల మంజూరుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. కాలనీలో చెత్త సేకరణకు చెత్త బండి, సీసీ కెమెరాలు, బోర్‌వెల్, వీధి కుళాయిలను ఏర్పాటు చేయాలన్నారు. కాలనీలో అనేక మంది ఆధార్ కార్డుల్లోని అడ్రస్‌లు మార్పు చేయాలని కోరినా ఫలితం కనిపించలేదని ఆక్షేపించారు. కాలనీ వాసుల సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు సూరమ్మ, అన్నపూర్ణ, బంగారమ్మ, సీతామహాలక్ష్మి, అబద్ధం, లక్ష్మి, షేక్ అహ్మద్ బేగం, రాంబాబు, కనకమహాలక్ష్మి, రాజు, గౌరి, ప్రియాంక, దీపిక తదితరులు పాల్గొన్నారు.

మూలస్వయంభూవరాన్ని తరలించాలంటూ ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మూలస్వయంభూవరం గ్రామస్తులు

పరవాడ: ఎన్టీపీసీ కాలుష్య కోరల్లో చిక్కుకున్న మూలస్వయంభూవరం గ్రామాన్ని సురక్షిత ప్రదేశానికి తరలించి,ప్రజలను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు. కార్యక్రమంలో పాల్గొన్న లోకనాథం మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ నుంచి ఎగసిపడుతున్న కాలుష్యంతో గాలి, నీరు కలుషితమవడమే కాకుండా ప్రజలు కంటి నిండా నిద్రకు నోచుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉప్పునీటి తుంపర్లు ఎగసిపడి, పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. విద్యుత్ వైర్లు తుప్పు పట్టి తెగిపడుతున్నాయని, తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. కాలుష్యం కారణంగా కిడ్నీ, ఊపిరితిత్తులు, చర్మ, కంటి సమస్యలతో గ్రామస్తులు బాధ పడుతున్నారని పేర్కొన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, రెవెన్యూ, మండల అభివృద్ధి అధికారులు గ్రామంలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల ప్రభుత్వానికి నివేదించి, గ్రామ తరలింపునకు సహకరించాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం గ్రామాన్ని తరలించేందుకు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఎన్టీపీసీ మెయిన్ గేటు వద్ద ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్, ఎంపీడీవోలకు అందించారు. ఆందోళన కార్యక్రమంలో సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, నాగిరెడ్డి రామారావు, బొండా సూరిబాబు, తుంపాల మరిడయ్య, బత్తిన రాముడు, మరిస రవి, బొండా రాజు, సరోజిని, అనురాధ, బత్తిన లక్ష్మి, పార్వతి, కె.సత్యవతి, రాము పాల్గొన్నారు.

అవగాహనతోనే క్షయ నియంత్రణ



అడవివరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్యకేంద్రం డిప్యూటి సివిల్ సర్జన్ డాక్టర్ రామిరెడి, సిబ్బంది



వాడచీపురుపల్లిలో క్షయ వ్యాధి పట్ల అవగాహన ర్యాలీ



ఎండ్ టీబీ ఆంగ్ల అక్షరాకృతిలో విద్యార్థులు



గురుకుల పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి కన్నంనాయుడు

- ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీలు

సింహాచలం: క్షయవ్యాధి పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని అడవివరం ఆరోగ్యకేంద్రం డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ రామిరెడ్డి తెలిపారు. ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆస్పత్రి నుంచి సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా డాక్టర్ రామిరెడ్డి మాట్లాడుతూ క్షయవ్యాధిని ఆదిలోనే గుర్తిస్తే త్వరితగతిన నయం చేయవచ్చన్నారు. క్షయ వ్యాధి బారిన పడినవారు క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. క్షయ రోగులపై వివక్ష తగదన్నారు. కార్యక్రమంలో ఆంధ్రా మెడికల్ కళాశాల వైద్యురాలు డాక్టర్ కృష్ణకుమారి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హలీనా, డాక్టర్ వరప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఆర్.ఝాన్సీరాణి, పీహెచ్ఎన్ ఎల్మాదేవి, డి.పార్వతీశం పాల్గొన్నారు.

పరవాడ: క్షయ(టీబీ) వ్యాధి ప్రాణాంతకం కాదని, తొలి దశలో గుర్తిస్తే చాలా వేగంగా నివారణ చేయొచ్చని వాడచీపురుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి వి.కనకప్పారావు అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని వాడచీపురుపల్లి గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. వారం పైబడి దగ్గు, రక్తం పడడం, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, నీరసంగా ఉండడం, ఛాతిలో నొప్పి వంటి లక్షణాలున్నవారు సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలల పాటు ఉచితంగా అందించే మందులను వాడాలన్నారు. క్షయ వ్యాధి ఊపిరితిత్తులు, ఇతర భాగాలకు సోకితే ఏడాది పాటు మందులు తీసుకోవాలన్నారు. నిశ్చయ పోషణ్ యోజన(ఎన్‌పీవై) కార్యక్రమం ద్వారా రోగుల పోషకాహారం నిమిత్తం ప్రతి నెల రూ.వెయ్యి చొప్పున 6 నెలల పాటు రోగులకు ప్రభుత్వం అందిస్తుందన్నారు. గ్రామంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు.

సబ్బవరం: ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల వైద్యాధికారి డాక్టర్ కె.కన్నంనాయుడు పాల్గొని క్షయ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ పద్ధతులను వివరించారు. తల్లిదండ్రులకు, పరిసర ప్రాంతాల వారికి అవగాహన కల్పించేలా విద్యార్థులను సూచించారు.

యూకలిప్టస్ తోటలో అగ్నిప్రమాదం

- ఐదెకరాల్లో రూ.8 లక్షల మేర ఆస్తి నష్టం



మంటలను ఆర్పుతున్న ఎన్టీపీసీ అగ్నిమాపక సిబ్బంది

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం శివారు కొండవానిపాలెం సమీపంలో యూకలిప్టస్ తోటలో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. 5 ఎకరాల్లో నాటిన యూకలిప్టస్ తోట కాలి బూడిదైంది. ఫలితంగా రైతులకు సుమారు రూ.8 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు అంచనా. గ్రామానికి చెందిన సారిపల్లి నేస్తాలు, అరిజిల్లి మసేను, కొండ ముత్యాలు, కొండ తాతారావు తదితర రైతులు మూడేళ్ల క్రితం ఐదెకరాల విస్తీర్ణంలో యూకలిప్టస్ తోటలు వేశారు. సోమవారం మధ్యాహ్నం సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు యూకలిప్టస్ తోటకు నిప్పు పెట్టడంతో, కాలిబూడిదైంది. అగ్నిప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు ఎన్టీపీసీ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. హుటాహుటిన ప్రమాద స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశబూరు. అగ్ని ప్రమాద సమాచారాన్ని పరవాడ రెవెన్యూ అధికారులకు అందించినట్లు నాయుడుపాలెం మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి తెలిపారు.

బైలపూడికి పైల పరామర్శ



బయలపూడి భగవాన్ జయరాంను పరామర్శిస్తున్న పైల శ్రీనివాసరావు, తదితరులు

పరవాడ: పెందుర్తి మండలం పినగాడి సర్పంచ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బైలపూడి భగవాన్ జయరాం తండ్రి సూర్యనారాయణ మాస్టర్ అకాల మరణం పట్ల వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు ప్రగాఢ సంతాపం తెలిపారు. పినగాడిలోని భగవాన్ జయరాం కుటుంబాన్ని సోమవారం కలిసి, పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల మాజీ అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు, పార్టీ నాయకుడు పైడింనాయుడు ఉన్నారు.

రాజకీయ కక్షతో వెల్‌నెస్ సెంటర్ బిల్లుల నిరాకరణ

- గండి బాబ్జి, ఆయన భార్య, సర్పంచ్ అరుణపై ఎంపీడీవోకు ఫిర్యాదు



ఎంపీడీవోకు వినతిప్రతం అందిస్తున్న యడ్ల నాయుడు

సబ్బవరం: మొగలిపురం గ్రామంలో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ పెండింగ్ బిల్లులను రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే చెల్లించట్లేదని గ్రామానికి చెందిన యడ్ల నాయుడు వాపోయారు. దీనిపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఎంపీడీవో పద్మజకు వినతి పత్రం అందించారు. రూ.21.60 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన ఈ భవనాన్ని పూర్తిచేసి, నాణ్యత నిర్ధారణ ధ్రువీకరణ తర్వాత గతేడాది మార్చి 24న అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. దీంతో ఎన్ఆర్ఈజీఎస్ నుంచి పెండింగ్ బిల్లు రూ.7,50,314లు గతేడాది నవంబర్ 20న గ్రామ పంచాయతీ ఖాతాకు జమ కూడా అయిందన్నారు. అప్పటి నుంచి ప్రతి పని దినంలో గ్రామ సచివాలయంలో సర్పంచ్ గండి అరుణ, పంచాయతీ కార్యదర్శిని అడుగుతున్నా బిల్లు చెల్లించడం లేదన్నారు. దీనిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా పంచాయతీ అధికారి, జెడ్పీ ఈఈ, ఎంపీడీవో ఈవోపీఆర్‌కు పలుమార్లు ఫిర్యాదులు చేసినా సమస్యకు పరిష్కారం చూపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లు చెల్లించేందుకు సర్పంచ్ నిరాకరిస్తున్నారని తన ఫిర్యాదుపై అధికారులు నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి సమర్పించారని పేర్కొన్నారు. ప్రస్తుత సర్పంచ్ గండి అరుణ, ఆమె భర్త మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత టీడీపీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండి బాబ్జీ మాటను కాదని తన కుటుంబ సభ్యులు సర్పంచ్‌గా పోటీ చేయడంతో కక్షగట్టి, తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆక్షేపించారు. అప్పులు చేసి గతంలో ఈ బిల్డింగ్ నిర్మించడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నట్లు తెలిపారు. తనతో పాటు భార్యాపిల్లలు రోడ్డున పడకుండా బిల్లులు చెల్లించి న్యాయం చేయాలని వినతిపత్రంలో కోరారు. దీనిపై స్థానిక ఎంపీడీవో పద్మజను వివరణ కోరగా.. గ్రామంలో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ బిల్లులు చెల్లించాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీదేనని తెలిపారు. గ్రామ సర్పంచ్ బిల్లులు చెల్లించేందుకు నిరాకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

విస్తం ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 175 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

పెందుర్తి: పినగాడి విస్తం ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 175 మంది విద్యార్థులు పలు సంస్థల్లో, వివిధ ఉద్యోగాలకు 175 మంది ఎంపికయ్యారు. వీల్స్ ఇండియా లిమిటెడ్, టీవీఎస్ ఇండియా తదితర కంపెనీల ప్రతినిధులు కళాశాలలో తొలుత విద్యార్థులకు ప్రాథమిక పరీక్ష నిర్వహించారు. అనంతరం జరిపిన ఇంటర్వ్యూల్లో 95 మంది బీటెక్ విద్యార్థులు, 80 మంది డిప్లొమా విద్యార్థులు ప్రతిభ కనబరిచి, ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రతినిధులు తెలిపారు. వీరిని కళాశాల ఎండీ మళ్ల అనూష ప్రత్యేకంగా అభినందించారు. ప్లేస్‌మెంట్ అధికారులు ఇ.కిరణ్‌కుమార్, ఎంవీజేటీ అరుణ్, ఇంజినీరింగ్, డిప్లొమా విభాగాధితులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పెందుర్తి

9912222753

Office mail : sakshiadvtvsp@gmail.com